ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

గురువారం 25 ఏప్రిల్ 2024



వర్గపోరు కారణంగా..

టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా గెలుపొందిన నాటి నుంచి నాయకుల్లో వర్గ పోరు మొదలైంది. గతంలో గోదావరిఖనిలో జరిగిన ఓ సమావేశంలో టీబీజీకేఎస్ రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసు కోవడంతో ఆ సంఘం అప్పటి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్ అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయిన విష యం కూడా అప్పట్లో చర్చనీ యాంశం అయింది. సింగరేణిలో ఉద్యోగాలు మొదలుకొని, అత్యంత కీలకమైన మెడికల్ అన్‌ఫిట్, మెడికల్ బోర్డులో, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో కొందరు టీబీజీకేఎస్ నాయకుల జోక్యం పెరిగిందనే ఆరోపణలు ఉండేవి. టీబీజీకేఎస్ వచ్చిన తరువాత కార్మిక క్షేత్రంలో పైరవీలు పెరిగాయని బహిరంగంగా ప్రచారం జరిగింది. దీనివల్ల కార్మికుల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొనగా, ఈ క్రమంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వ హిస్తే పరిస్థితులు తమకు అనుకూలిస్తాయో...లేదోననే అనుమానంతో టీబీజీకేఎస్ ఎన్నికలు నిర్వహించకుండా శతవిధాలా ప్రయత్నం చేసింది. ఈ లోగా అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం జరిగిపోయాయి. దీంతో గుర్తింపు ఎన్నికలు అనివార్యం కాగా, డిసెంబరు 27న నిర్వహించిన ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపొందింది.

'గుర్తింపు' ఎప్పుడో?

- డిసెంబరులోనే ముగిసిన సింగరేణి ఎన్నికలు
- ఇప్పటికీ ధ్రువీకరణపత్రం అందజేయని వైనం
- ఎన్నికల్లో గెలుపొందిన సంఘానికి ప్రాతినిథ్యం కరువు
- రెండేళ్ల కాలపరిమితి కోసం హెచ్‌ఎంఎస్ లేఖ

మంచిర్యాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు గడు స్తున్నా..ఇప్పటికే గెలుపొందిన సంఘానికి ధ్రువీకరణ పత్రం అందజేయకపోవడంతో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసి సుమారు ఐదు సంవత్సరాలు గడవడంతో ఎన్నికల నిర్వహణ కోసం జాతీయ సంఘాలు పట్టుబట్టాయి. కాల పరిమితి ముగిసినా సింగరేణి గుర్తింపు యూనియన్‌గా టీబీజీకేఎస్ కొనసాగడంతో జాతీయ సంఘా లైన ఐఎన్టీయూసీతోపాటు ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, బీఎంఎస్ ఎన్నికలు నిర్వహించేలా యాజమాన్యంపై ఒత్తిడి పెంచాయి. సింగరేణి యాజమాన్యం, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని నెలలుగా ఎన్నికలను ఉద్దేశ్యపూర్వకంగా వాయిదా వేయడం, గుర్తింపు ఎన్నికలు నిర్వహించలేమని కోర్టుకు కూడా వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటికే గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల కాగా, వివిధ సంఘాల నుంచి నామినేషన్ల ప్రక్రియ కూడా ముగిసింది. అయినప్పటికీ వివిధ కారణాలతో ఎన్నికలు వాయిదా పడుతూ వచ్చాయి.

నాలుగు నెలలు గడుస్తున్నా..

సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలుపొందినప్పటికీ నాలు గు నెలలు గడుస్తున్నా కేంద్ర కార్మికశాఖ ధ్రువీకరణ పత్రం అందజేయడం లేదు. దీంతో ఏఐటీయూసీకి కార్మికుల పక్షాన ప్రాతినిథ్యం వహించే అధికారం లేకుండా పోయింది. ధ్రువీకరణ పత్రం అందజేయకపోవడంలో లిటిగేషన్ ఉందంటూ హెచ్‌ఎంఎస్ ఆరోపిస్తోంది. కేంద్ర కార్మికశాఖ రెండేళ్ల కాలపరిమితితో ధ్రువీకరణ పత్రం అందజేసేందుకు సిద్ధంకాగా ఏఐటీయూసీ నాలుగేళ్లకు పట్టు బడుతుందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో టీబీజీకేఎస్ గెలుపొందినప్పుడు నాలుగేళ్ల కాలపరిమితితో ఎన్నికలు జరిపేందుకు అన్ని సంఘాలు మొగ్గు చూపాయి.

దీనికి భిన్నంగా కేంద్ర కార్మికశాఖ మాత్రం టీబీజీకేఎస్‌కు రెండేళ్లకే ధ్రువీకరణ పత్రం అందజేసింది. అయితే కేంద్ర కార్మిక శాఖ ఇచ్చిన అధికార పత్రంలో రెండేళ్లుగా పేర్కొనడంతో ఎన్నికలు పూర్తయిన ఆరు నెలల తర్వాత తాము ధ్రువీకరణ పత్రం అందుకున్నామని, 2020 ఏప్రిల్ వరకు కాలపరిమితి ఉందంటూ అప్పుడు టీబీజీకేఎస్ భీష్మించుకుంది. ప్రస్తుతం అదే దారిలో ఏఐటీయూసీ కూడా నడుస్తుందనేది హెచ్‌ఎంస్ వాదన. గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపొంది ఇప్పటికే నాలుగు నెలలు పూర్తికాగా, మరో రెండు నెలలు సాగదీస్తే, తాము కూడా టీబీజీకేఎస్ మాదిరిగా నాలుగేళ్ల పదవిని అలంకరించవచ్చుననే అభిప్రాయంతో ఏఐ టీయూసీ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆలోచనకు చెక్ పెడుతూ రెండేళ్ల కాలపరిమితికే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇటీవల హె చ్‌ఎంఎస్ కేంద్ర కార్మికశాఖకు లేఖ రాసింది. ఈ క్రమంలో సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలుపొందిన ఏఐటీయూసీ భవిష్యత్తు ఎలా ఉండ బోతుందనే చర్చ కార్మిక వర్గంలో జోరుగా సాగుతోంది. అధికారులు గు ర్తింపు సంఘానికి వెంటనే ధ్రువీకరణ పత్రం అందజేయడం ద్వారా సమ స్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్మికులు కోరుతున్నారు.

కాలపరిమితి ముగియడంతో...

కోల్‌బెల్ట్ ప్రాంతంలోని మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపెల్లి, ఖమ్మం, భూపాలపల్లి జిల్లాల్లో సింగరేణి సంస్థ విస్తరించి ఉంది. అప్పటి వరకు గుర్తింపు సంఘంగా ఉన్న బీఆర్ఎస్ అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కాల పరిమితి 2019తో ముగిసింది. 2017 అక్టోబరు 5వ తేదీన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ ఎస్‌కు అనుబంధంగా టీబీజీకేఎస్ గెలుపొందింది. 2019 అక్టోబరు 5 నాటికే కాల పరిమితి పూర్తయింది. అయితే మొదట నాలు గేళ్ల కాలపరిమితికి ఎన్నికలు జరిపేందుకు అన్ని సంఘాలు మొగ్గు చూపినప్పటికీ కేంద్ర కార్మికశాఖ మాత్రం టీబీజీకేఎస్‌కు రెండేళ్లకే ధ్రువీకరణ పత్రం అందజేసింది. అయితే కేంద్ర కార్మిక శాఖ ఇచ్చిన అధికార పత్రంలో రెండేళ్లుగా పేర్కొనడంతో ఎన్నికలు పూర్త యిన ఆరు నెలల తర్వాత తాము ధ్రువీకరణ పత్రం అందుకు న్నామని, 2020 ఏప్రిల్ వరకు కాలపరిమితి ఉందంటూ నాయకులు చెబుతూ వచ్చారు. ఈ లోపు కరోనా ఎంట్రీ ఇవ్వడంతో మరింత ఆలస్యమైంది. అలా పదవీకాలం ముగిసినా మరో నాలుగేళ్ల అధనంగా టీబీజీకేఎస్ పదవిలో కొనసాగింది.

ఆరో రోజు 12 నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే

పెద్దపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్ర జ్యోతి): పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి బుధవారం 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ఇరుగురాల భాగ్యలక్ష్మి, యువతరం పార్టీ నుంచి చిలుక ఆనంద్, స్వతంత్ర అభ్యర్థులుగా రాచర్ల రాజేశం, నీరటి శంకర్, నూకల నవీన్, దుర్గం రాజ్ కుమార్, కుర్మ మహేందర్, మోటం రవీందర్, బూడిద తిరుపతి, కాశి సతీష్ కుమార్, చందనగిరి శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకు 41 మంది అభ్యర్థులు 55 సెట్లలో నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నెల 25వ తేదీ నాటికి నామినేషన్ల ప్రక్రియ ముగియనున్నది.

పేదల సంక్షేమమే లక్ష్యం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

ఏసీసీ, ఏప్రిల్ 24: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుం దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద ప్రజల వైద్యం కోసం రూ. 5 లక్షల అయుష్మాన్ భారత్, రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి, ఉచిత కరోనా టీకాలు, ఉచిత రేషన్ బియ్యం అందించి పేదలకు మోదీ అండగా నిలిచారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏసీసీ, ఏప్రిల్ 24 : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలు గురువారం నుంచి మే 2 వరకు జరుగనున్నట్లు డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో పదో తరగతి కోసం రెండు పరీక్ష కేంద్రాలు, ఇంటర్ కోసం మూడు పరీక్ష కేంద్రాలు, బెల్లంపల్లిలో పదో తరగతి కోసం ఒక పరీక్ష కేంద్రం, ఇంటర్‌కు రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో 671 మంది, ఇంటర్‌లో 1330 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

యువత వ్యసనాలబారిన పడొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 24 : యువత వ్యసనాల బారిన పడొద్దని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డీసీపీ అశోక్‌కుమార్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవో రాములు, హరికృష్ణ, అబ్కారీ, మద్యపాన నిషేధ శాఖ పర్యవేక్షకులు నంద గోపాల్, డీఐఈవో శైలజ, డీఈవో యాదయ్యలతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు రవాణా కాకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి సాగు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మత్తు పదార్థల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమాలు..

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో మీడియా ప్రతినిదులలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి సెగ్మెంట్లలో ఎన్నికలు జరగనున్నాయని ఎన్నికల కోసం పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మే 13 పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. ఓటింగ్ శాతం పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, పౌర సరఫరా అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

ఫెయిల్ అయ్యామని ఇద్దరు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య



తేజస్విని(ఫైల్)

నస్పూర్, ఏప్రిల్ 24: ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది బుధవారం మంచిర్యాల జిల్లాలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొరగారిపల్లికు చెందిన గటిక తేజస్విని (18) బుధవారం వెలవడిన ఇంటర్ ప్రథమ సంవత్సరం గణితం రెండు పేపర్లలో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఆత్మహత్యకు పాల్పడింది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ చెప్పిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో తేజస్విని ఎంపీసీ మొ దటి సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం పరీక్ష ఫలితాలు వెల్లడి కావడం, అందులో గణితంకు సంబంధించిన రెండు పేపర్ల ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపం చెంది గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యుల గమనించి మంచిర్యాల ప్రభు త్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందిందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.



సాత్విక్(ఫైల్)

తాండూర్: ఇంటర్మీడియట్ పరీక్షలో ఫెయిల్ అవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన మైదం సాత్విక్ (18) అనే విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై జగదీష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చలాపూర్ గ్రామానికి చెందిన సాత్విక్ బెల్లంపల్లి పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతున్నాడు. బుధవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'మిమ్స్' విద్యార్థుల విజయకేతనం



సాక్షి, షహేదా, శృతి, లిఖిత, అతియాతుల్‌హాడీ

ఏసీసీ, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో మంచిర్యాల పట్టణంలోని మిమ్స్ కళాశాల విద్యార్థులు ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో శృతి, జశ్వంత్‌లు 470కి 466 మార్కులు, మనస్విత 465, అశ్విత 465, బైపీసీలో సుధాకర్ 440కి 436, వెన్నెల 435, షహేదా 432 మార్కులు సాధించారు. సీఈసీలో సాక్షి 500లకు 480, స్పందన 478 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో లిఖిత 1000కి 990 మార్కులు, అక్షిత 988, లోహిత 985, అరవింద 984 సాధించారు. బైపీసీలో సాయి ప్రత్యూష 979, ఇర్షత్ జియాబాను 979, హతియాతుల్‌హాడీ 975, సీఈసీలో సుమేయమహిర్ 942 మార్కులు సాధించారు. వీరిని కళాశాల కరెస్పాండెంట్ శ్రీనివాసరాజు, ప్రిన్సిపాల్ శైలజ, డైరెక్టర్లు ఉపేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, విజయ్‌కుమార్ అభినందించారు.

'ఎస్ఆర్ఆర్' విద్యార్థుల ప్రతిభ



సానియాభాను, సాయిదివ్య, వాగ్దేవి, మనోజ్ఞ, రంజిత్

ఏసీసీ, ఏప్రిల్ 24: ఇంటర్ ఫలితాల్లో మంచిర్యాలలోని ఎస్ఆర్ఆర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో వాగ్దేవి 470కి 465 మార్కులు , సాయిదివ్య 465, బైపీసీలో మనోజ్ఞ 440కి 43 మార్కులు, సీఈసీలో రంజిత్ 500లకు 482 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కావ్యశ్రీ 1000కి 980, బైపీసీలో సానియాభాను 1000కి 966 , సీఈసీలో సాయిచరణ్ 1000కి 939 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ మల్లేష్, కరెస్పాండెంట్ మానయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్‌లు శ్రీధర్,రాజు, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్‌లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఏసీసీ, ఏప్రిల్ 24 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో సనావర్ శిఫాలీ 1000కి 991 సాధించి రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. నరెడ్ల సాయివరుణ్‌కుమార్ 989 మార్కులు, సంగ శివానీ 989, ఓరుగంటి ప్రణతి 987 మార్కులు సాధించారు. బైపీసీలో బంధం సంజన 1000కి 981, కునరపు మేఘన 981, ప్రజ్ఞశ్రీ 979, అయేషాఅలీ 970 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో లలితరాథోడ్ 1000కి 954, సునందిని 920, సీఈసీలో నిమ్రా అజ్మీ 978, భానుశ్రీ 970, రేష్మ 958 మార్కులు సాధించారు. ఇంటర్ ప్రతమ సంవత్సరం ఎంపీసీలో కొంతం అభిలాష్ 470కి 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. నర్మళ్ల స్ఫూర్తి 467, శ్రీరాంచరణ్ 467, అమతుల్‌లుబినా 467, సాయిచరణ్ 466 మార్కులు సాధించారు. బైపీసీలో సృజన కళ్యాణి 440కి 433 మార్కులు, వైశాలి 432, వైష్ణవి 429, సాయివర్షిణి 424 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో శ్రీవల్లికపటేల్ 500లకు 490, రిషిత 490, మధుశాలిని 485 మార్కులు, సీఈసీ విభాగంలో జహాన్ 500లకు 470, ఫాతిమా 460, మహ్మద్ సభ 456 మార్కులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా

ఏసీసీ, ఏప్రిల్ 24 : ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. మంచిర్యాల జిల్లాలో మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 2,520 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా 858 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 612 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా 250 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం మొత్తం బాలురు 3,132 మంది పరీక్ష రాయగా 1,108 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత శాతం 35.37. జనరల్ విభాగంలో బాలికలు 2,935 మంది పరీక్ష రాయగా 1,667 మంది ఉత్తీర్ణత సాధించారు.ఒకేషనల్ విభాగంలో బాలికలు 496 మంది పరీక్షకు హాజరు కాగా 339 మంది ఉత్తీర్నత సాధించారు. మొత్తం 3431 మంది పరీక్ష రాయగా 2006 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణత 58.46 శాతంగా ఉంది. మొదటి సంవత్సరంలో బాల బాలికలు జనరల్, ఒకేషనల్ విభాగంలో 6,563మంది హాజరు కాగా 3114 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 47.44గా ఉంది. కాగా ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 2451 మంది బాలురు పరీక్షకు హాజరు కాగా 1189 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 608 మంది పరీక్ష రాయగా 297 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం బాలురు 3059 మంది హాజరు కాగా 1486 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురలో ఉత్తీర్ణత 48.57 శాతం. ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో బాలికలు 2,919 మంది హాజరు కాగా 2,008 ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 502 మంది హాజరు కాగా 413 మంది ఉత్తీర్ణత సాధించా రు. మొత్తం బాలికలు 3421 మంది పరీక్షకు హాజరు కాగా 2421 మంది ఉత్తీర్నత సాధించారు. బాలికల ఉత్తీర్ణత 70.76 శాతం. ద్వితీయ సంవత్సరం జనలర్‌లో 6480 మంది పరీక్ష రాయగా 3907 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 60.29గా ఉంది.

తాండూర్: మండలంలోని కాసిపేట గ్రామానికి చెందిన సాత్విక్ ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీలో 440 మార్కులకు 436 మార్కులు సాధించి స్టేట్ 3వ ర్యాంకు సాధించారు. సాత్విక్ తాండూర్ మండలంలోని సెయింట్ థెరిస్సా పాఠశాలలో 7వ తరగతి వరకు, బెల్లంపల్లి సీవోఈలో పదవ తరగతి పూర్తి చేశాడు. ప్రస్తుతం హైద్రాబాద్‌లోని గౌలిదొడ్డిలోని సీవోఈ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాత్విక్ తల్లిదండ్రులు రాజ్యలక్ష్మి, వెంకటేష్ అభినందించారు.

రోడ్డు వేసే దాక ఓటు వేయం
- అధికారులకు తేల్చిచెప్పిన గ్రామస్థులు

కోటపల్లి, ఏప్రిల్ 24 : మండలంలోని రాజారం గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఎంపీ ఎన్నికల్లో ఓట్లు వేయమని తీర్మానించారు. దీంతో గురువారం చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్, ఎంపీడీవో ఆకుల భూమన్న, డిప్యూటి తహసీల్దార్ నవీన్, గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి బద్రినాథ్ స్వామిలతో కూడిన అధికార బృందం, రాజారం గ్రామ పంచాయతీలో గ్రామస్తులతో సమావేశమైంది. ఓటు వేయడం ప్రజాస్వామ్యమని ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభించకూడదని చెప్పారు. ఆ తర్వాత సమస్యలను పరిష్కరిస్తామని గ్రామస్థులకు తెలిపారు. అయితే గ్రామస్తులు రోడ్డు నిర్మించేంత వరకు తాము ఓట్లు వేయమని ఖరాకండిగా చెప్పారు. రహదారి లేక నానా అవస్థల పాలవుతున్నామని తమ పిల్లలు కాలినడకన ఆరు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు కాలినడకన వెళ్లాల్సి వస్తుందని సమస్యలు పరిష్కరించేంత వరకు ఎవరు ఎన్ని చెప్పినా తాము ఓట్లు వేసేది లేదని చెప్పారు. సుమారు గంటన్నర పాటు గ్రామస్థులతో అధికారులు చర్చలు జరిపినా వారు వినిపించుకోలేదు.. దీంతో అధికారులు గ్రామస్థులు చెప్పిన విషయాన్ని కలెక్టర్‌కు చెబుతామంటూ వెనుదిరిగారు.

మెరుగైన సేవలు అందించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 24: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం మాతా శిశు ఆసుపత్రిని సందర్శించారు వార్డులను, ల్యాబ్, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులతో స్నేహపూర్వకంగా ఉండాలని, గర్భిణులకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, ఆర్ఎంఓ భీష్మ ఉన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

మందమర్రిరూరల్, ఏప్రిల్ 24: మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేశామని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని తెలియజేస్తామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నస్పూర్, ఏప్రిల్ 24: నస్పూర్ పట్టణం సీతారంపల్లిలోని రైతువేదిక వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ రాహుల్ ప్రారంభించారు. అనంతరం రైతులు తెచ్చిన వరిధాన్యాన్ని అదనపుకలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా కొనుగోళ్లను వేగవంతంచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, డీఎంసీ రాజు, టీఎంసీ నాగరాజు, మెప్మా ఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఏడవ రోజు

12నామినేషన్లు దాఖలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 24: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గానికి 7వ రోజైన బుధవారం 12 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా రిటర్నింగ్ అధికారి రాజార్షిషా తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు తరఫున మూడవ సారి జడ్పీ ఛైర్మన్ రాథోడ్ జనార్ధన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాజిద్, డాక్టర్ రవికిరణ్‌కుమార్, పురుషోత్తం యాదవ్, దుర్వనగేష్‌లు నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ ముథోల్ ఇన్‌చార్జీ రమాదేవి, ఆదివాసీ తుడందెబ్బ గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య, కోలం సంఘం జిల్లా అధ్యక్షుడు కొడప సోనేరావు, ఆంద్ సంఘం ఉపాధ్యక్షుడు సర్కే దత్తు, పోతింక్ శంకర్‌లతో కలిసి 4వ నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. అలాగే బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ తరపున మొదటి సారి నామినేషన్ దాఖలు చేయడానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబులతో కలిసి గోడం నగేష్ తన నామినేషన్‌ను దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి తరపున రెండవ సెట్ నామినేషన్‌ను అయ్యన్నగారి భూమన్న, బీజేపీ పార్టీ పార్లమెంటరీ కో కన్వీనర్ నిర్మల్ రెండవ సెట్, మూడవ సెట్‌ను ఆరెళ్లి మల్లేష్, వేదవ్యాస్ బీజేపీ పట్టణ కార్యదర్శి, నాల్గవ సెట్‌ను పతంగే బ్రహ్మానంద్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేష్ నామినేషన్ దాఖలు, అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ మూడవ సెట్ నామినేసన్‌ను దాఖలు చేశారు. గోండ్వానా దండకారణ్య పార్టీ తరపున కొడప వామన్‌రావు, అలాగే ఇండిపెండెంట్ రాథోడ్ సుభాష్ తరపున చాటే వినోద్ మూడవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా ఇండిపెండెంట్లు నేతావత్‌రాందాస్, కొమురం ముత్తయ్యలు లోక్‌సభ స్థానానికి నామినేషన్ వేశారు. చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తుంది.

డిమాండ్లు పరిష్కరించాలి

- తహసీల్దార్ కార్యాలయాల్లో ఆటో సంఘం నాయకుల వినతి

నస్పూర్, ఏప్రిల్ 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు ఎంతో సంతోషకరమైన విషయం అయినప్పటికీ తమకు ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జీ చెల్ల విక్రమ్, కమిటీ సభ్యులు సుధాకర్, పట్టణ ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కాసిపేట: ఆటో డ్రైవర్ల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బుధవారం తహసీల్దార్ భోజన్నకు ఆటో యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఆటో యూనియన్ నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. వెంటనే ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రామారావు, రాయలింగు, దుర్గయ్య, గోపాల్, పోశం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆటో యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఆటో యూనియన్ నాయకుడు సత్యనారాయణ, సతీష్, రఘులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మహాలక్ష్మీ పథకం ద్వారా ఆటోలకు గిరాకీ లేక పస్తులుంటున్నామన్నారు. కుటుంబాలను పోషించలేక ఇప్పటి వరకు 40 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తాండూర్: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మం డల ఆటోయూనియన్ నాయకులు బుధవారం ఆర్‌ఐకి వినతి పత్రం అందించారు. అధ్యక్షుడు మొహ్మద్ హబీబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

బెల్లంపల్లి, ఏప్రిల్ 24: మండలంలోని తాళ్లగురిజాల గ్రామానికి చెందిన బొమ్మగోని అనిల్ (28) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే మంగళవారం రాత్రి తన ఇంట్లో ఫోన్‌కు పెట్టిన చార్జర్ వైరును తీస్తుండగా అనిల్‌కు విద్యుత్ షాక్ తగిలింది. గమనించిన కుటుంబీకులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. కాగా మృతికి హై ఓల్టేజీతోనే ఫోన్ చార్జర్‌కు విద్యుత్ సరఫరా జరిగి అనిల్ మృతిచెందాడని కుటుంబీకులు ఆరోపించారు. కాగా హై ఓల్టేజీ కారణంగానే అనిల్ మృతిచెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు, గ్రామస్థులు బెల్లంపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి గ్రామంలో టూ ఫేస్ విద్యుత్ సరఫరా అవుతుందని, ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. అనిల్ మృతికి కారణమైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని అనిల్ కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, అనిల్ మృతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, ఎస్‌ఐ నరేష్‌లు చేరుకుని ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

నిలిచిన వివాహం

మందమర్రిరూరల్, ఏప్రిల్ 24 :మందమర్రి పట్టణానికి చెందిన యువతి (21) వివాహం బుధవారం జరగాల్సి ఉండగా ఆగిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సారంగపల్లి పంచాయతీలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన సంపత్‌గౌడ్, మందమర్రి పట్టణానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. అనంతరం వారి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారు. ఈ క్రమంలో యువతికి తల్లిదండ్రులు బెల్లంపల్లికి చెందిన యువకునితో పెళ్లి నిశ్చయించారు. బుధవారం పెళ్లికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో యువతి ప్రియుడు సంపత్‌గౌడ్ బెల్లంపల్లికి వెళ్లి యువతిని చేసుకోబోయే వ్యక్తికి వారిద్దరు కలిసి సన్నిహితంగా ఉన్న ఫోటోలు చూపించడంతో పెళ్లి ఆగిపోయింది. యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

ఐకే 1ఏ గనిలో ప్రమాదం

జైపూర్, ఏప్రిల్ 24 : శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ గనిలో బుధవారం మొదటి షిఫ్టులో విధులు నిర్వహిస్తున్న బొడ్డు తిరుపతి అనే ఎలక్ట్రిషియన్ కార్మికునికి ప్రమాదం జరిగినట్లు కార్మికులు పేర్కొన్నారు. తోటి కార్మికుల వివరాల ప్రకారం అండర్‌గ్రౌండ్‌లో వెల్డింగ్ ప్లాంట్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు లేచాయి. మంటల తీవ్రతకు తిరుపతి ముఖం, ఇతర చోట్ల గాయాలయ్యాయి. . ప్రమాదంలో గాయపడిన తిరుపతిని హుటాహుటిన అధికారులు మంచిర్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వాహనంలో తరలించినట్లు పేర్కొన్నారు. తమకు విషయం సరికాదని కార్మికులు వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

కేసీఆర్, కేటీఆర్‌ను అరెస్టు చేయాలి

● ఎమ్మెల్యే గడ్డం వివేకానంద



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వివేకానంద

ఏసీసీ, ఏప్రిల్ 24: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లను అరెస్టు చేయలని ఎమ్మెల్యే గడ్డం వివేకానంద అన్నారు. జిల్లా కేంద్రంల ోని ఆయన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజ కవర్గంలోని ఎమ్మెల్యేలమంతా కలిసి వంశీ గెలుపు కోసం కృషి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్‌పై విసిగిపోయి ఉన్న కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నార న్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపీ సీట్లను కైవసం చేసుకుం టుందన్నారు. ఎన్నికల అనంతరం ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ. 2500 పథకం ప్రారంభిస్తామన్నారు. ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని యువతను మోసం చేసిందని, రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఇవ్వకుండా మొండిచేయి చూపించిందని విమర్శించారు. చెన్నూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. సింగరేణిలో కొత్త గనులు ఏర్పాటు చేయడంతో పాటు జైపూర్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల మరో యూనిట్ ను ఏర్పాటు చేసి 80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇస్తామన్నారు. మందమర్రిలో లెదర్ పార్కును త్వరలో ప్రారంభిస్తామని, మాదిగలకు కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని తెలిపారు. సింగరేణి అప్పుల్లో ఉన్నప్పుడు కాకా వెంకటస్వామి 450 కోట్ల రుణం ఇప్పించి మూత పడకుండా చూసి లక్ష ఉద్యోగాలను కాపాడారని తెలిపారు. రామగుండం ఫెర్టిలైజర్ కార్పొరేషన్ పునరుద్ధరణకు కాకా కృషి చేశారన్నారు. విభజించి పాలించే సిద్ధాంతాన్ని బీజేపీ, బీఆర్ఎస్‌లు పాటిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకుందని, దళితులను మోసం చేసిందన్నారు. గడ్డం వంశీ మాట్లాడుతూ ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాదిగ హక్కుల దండోరా నాయకుడు రేగుంట సునీల్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

కాసిపేట, ఏప్రిల్ 24: కాసిపేట 108లో ఈఎంటీగా పనిచేస్తున్న ఆత్మారాం సేవలను గుర్తించిన ఈఎంఆర్‌గ్రీన్ హెల్త్ సెవీసెస్ సంస్థ లైఫ్ సేవర్ అవార్డును ఇచ్చి ఘనంగా సత్కరించింది. గత ఏడాది జనవరిలో బెల్లంపల్లి కాల్‌టెక్స్ సమీపంలో మాల గురిజాలకు చెందిన యువకుడు క్రాంతికుమార్ రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. 108కు సమాచారం అందించడంతో ఆత్మారాం సకాలంలో స్పందించి గాయపడిన యువకుడికి ప్రథమచికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. దీంతో ఆయనకు ఈ అవార్డు వచ్చింది. సంస్థ సీవో ఖలీద్ బుధవారం హైదరాబాద్‌లో అవార్డును అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ వెంకటేశం, ప్రోగ్రాం మేనేజర్ స్వామీట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

దండేపల్లి, ఏప్రిల్ 24: శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని దండేపల్లి ఎస్సై లింగంపల్లి భూమేష్ అన్నారు. దండేపల్లి ఎస్సైగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల 11న దండేపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన స్వరూపరాజ్ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో ఆయన స్థానంలో రామగుండం వీఆర్ ఎస్సైగా పని చేసిన భూమేష్ దండేపల్లికి వచ్చారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

భీమయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి



భీమయ్య విగ్రహం వద్ద పూజలు చేస్తున్న సభ్యులు

కాసిపేట, ఏప్రిల్ 24: మద్దిమాడ పోలీసు కాల్పుల్లో అమరుడైన చేనేని భీమయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు అన్నారు. మద్దిమాడలో చేనేని భీమయ్య 36వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి సంప్రదా యబద్ధంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రభుత్వాలు భీమయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించడాన్ని విస్మరించాయన్నారు. ఇది సరైంది కాదని చెప్పారు. అధికారికంగా నిర్వహించాలన్నారు. పోలీసు కాల్పుల అనంతరం జిల్లా అధికారులు వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను బాధిత కుటుంబాలకు అందించాలన్నారు. అంతకుముందు సంప్రదాయ వాయి ద్యాలతో ర్యాలీగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, మాజీ సర్పంచులు రొడ్డ రమేష్, ఆడె జంగు, నాయకపోడ్ సంఘం నాయకులు భీంరావు, రాజన్న, భార్గవ్, శ్రీనివాస్, మేంద్రపు రాజన్న, మహేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, ఏప్రిల్ 24: సింగరేణిని కాపాడడం కోసం ఉద్యోగులు కొదమ సింహాలై కదలాలని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన టీబీజీకేఎస్ రాష్ట్ర సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 134సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి కోసం అనేక మంది అసువులు బాసారని చెప్పారు. సింగరేణి సంస్థ వినియోగించే యంత్ర సామగ్రి, పనిముట్లను తయారు చేసే పరిశ్రమలను నెలకొల్పే విధంగా కోల్‌బెల్ట్ ఏరియా యువతను సింగరేణి యాజమాన్యం ప్రోత్సహించాలని, సింగరేణి సంస్థ కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యే విధంగా కార్మికులకు సింగరేణి యాజమాన్యం కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికవాడల్లో కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారని, ఇప్పటికైనా వారికి మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ఓపెన్‌కాస్టు సర్ఫేస్‌లో పని చేసే కార్మికుల పని వేళలను మార్చాలని, ఈపీ ఆపరేటర్లకు నిర్ణీత సమయానికి ప్రమోషన్లు ఇవ్వాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. సింగరేణి యాజమాన్యానికే కొత్త బ్లాకులను అప్పగించాలని, ప్రైవేట్ సంస్థలకు ఇవ్వరాదని కోరారు. 14అంశాలపై తీర్మాణాలు ప్రవేశపెట్టగా, ఈ తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సభ ప్రారంభం ముందు టీబీజీకేఎస్ జెండాను ఆవిష్కరించి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన 13మంది యూనియన్ ప్రతినిధులకు ఘన నివాళులర్పించారు. సభలో కళాకారులు బల్లి సురేందర్, మల్లేష్ ఆధ్వర్యంలో ఉద్యమ గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నూనె కొమురయ్య, మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి, శ్రీనివాసరావు, సంపత్, వడ్డేపల్లి శంకర్, ఐలి శ్రీనివాస్, పెట్టెం లక్ష్మణ్, సమ్మయ్య, వీరభద్రం, బడికెల సంపత్, జాహెద్‌పాషా, కాపు కృష్ణ, వెంకటేష్, సాంబయ్య, రవీందర్, చల్లా రవీందర్‌రెడ్డి, చెల్పూరి సతీష్, రమేష్, అవినాష్, శేషగిరి పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● తాండూర్: గంభీరావుపేటకు చెందిన మల్యాల తిరుపతి పని నిమిత్తం మాదారంటౌన్‌షిప్‌కు బుధవారం వచ్చాడు. అతనికి సామ్‌సంగ్ ఫోన్ దొర కడంతో దాన్ని తీసుకుని వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అందించినట్లు సీఐ కుమారస్వామి, ఎస్సై అనూష తెలిపారు.

● కన్నెపల్లి: మండలంలోని ఐతపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో బుధవారం 8 లీటర్లగుడుంబాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ లచ్చన్న తెలిపారు. నిందితుడు దాసరి సాయికుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

● నస్పూర్: నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను వేసవి ఎండల కారణంగా చేపట్టాల్సిన జాగ్రత్తలపై బుధవారం జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ సుబ్బారాయుడు సిబ్బందికి అవగాహన కల్పించారు. వేసవి ఎండల కారణంగా చేపట్టాల్సి జాగ్రత్తలు, ఆరోగ్య సమస్యలపై పీహెచ్‌సీ సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లకు సూచనలు, సలహాలను ఇచ్చారు.

● హాజీపూర్: మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన చిలుముల లక్ష్మి (70)అనారోగ్యంతో మృతిచెందగా ఆమె మృతదేహాన్ని బుధవారం మంచిర్యాల మెడికల్ కళాశాలకు అప్పగించారు. భర్త లక్ష్మయ్య, కుటుంబీకులు లయన్స్ క్లబ్ సీనియర్‌సభ్యుడు రామాంజనేయులను సంప్రదించి వారి అనుమతితో మృతదేహాన్ని మెడికల్ కళాశాలలో విద్యార్థులకు బోధన నిమిత్తం అందజేశారు.

● మందమర్రిరూరల్: అందుగులపేటలోని లక్ష్మీగణపతి రైసుమిల్లును బుధవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ తనిఖీ చేశారు. మిల్లులోని ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లోడ్ అన్‌లోడ్ చేయాలని సూచించారు. ధాన్యం రవాణాలో నిర్లక్ష్యం చేయవద్దని రైసుమిల్లు యాజమానికి సూచించారు.

● మందమర్రిటౌన్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి ఎంఆర్‌పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం మంచిర్యాలలోని ఆయన నివాసానికి వెళ్లి కలిశారు. నాయకులు రాజేష్‌కుమార్, రాజన్న, మొండి, శంకర్, బాబు, సమ్మయ్య, లింగయ్య, మొగిలి, రవీందర్, రాజేశం, నరేష్, శ్రీకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

- విద్యతోనే ప్రగతి సాధ్యమని, అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని వయోజన విద్యాశాఖ వరంగల్ డిప్యూటి డైరెక్టర్ బాబురావు అన్నారు. పట్టణంలోని శ్రీపతినగర్‌లో గల వయోజన విద్యా కేంద్రం, కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు.

● బెల్లంపల్లి : పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ స్థాపించి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం ఫేర్‌వెల్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ వంగల చక్రపాణి, పాల్గొన్నారు.



వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు

- 4,60,196 ఎకరాల్లో పంటల సాగుకు అంచనా
- ఏడు లక్షల పత్తివిత్తనాల ప్యాకెట్ల అవసరం
- వాణిజ్య పంటల వైపే రైతుల మొగ్గు
- 85.91మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమంటున్న అధికారులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: వానకాలం సాగు ప్రణాళిక ఖరారైంది. జూన్ మొదటి వారంలో రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలుపడంతో అన్నదాతలు వానాకాలం పంట కోసం సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్నడం సేంద్రియ ఎరువులను పంటచేలలో వేయడం వంటి పనులు ప్రారంభించారు. ఇదే సమయంలో ప్రభుత్వం కూడా వానకాలం సాగు ప్రణాళికలను ఖరారు చేసింది. దీంతో వ్యవసాయాధికారులు పంటసాగుపై అంచనాలు రూపొందించారు. ఈ ఏడాది సాధారణానికి మించి పంటలు సాగయ్యే అవకాశం ఉందని అధికారుల లెక్కలు వేశారు. ఈ వానాకాలం సీజన్‌లో 4,60,196ఎకరాల్లో అన్నిరకాల పంటలు సాగవుతాయని అంచనాలు వేసిన అధికారులు ఈ మేరకు 7లక్షల పత్తివిత్తన ప్యాకెట్లు, 85.91 మెట్రిక్‌టన్నుల ఎరువులు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

జిల్లాలో 4,60,196 ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,60,196 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనాలు వేశారు. సాధారణ సాగుకు మించి పంటలు సాగయ్యే అవకాశం ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లాలో ఈ మేరకు అంచనాలు వేసిన అధికారులు పంటల సాగుపై గ్రామాల వారీగా పట్టికలు రూపొందించారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం కంటే పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు లెక్కలు వేశారు. అయితే వీటిలో పత్తి 3.5లక్షల ఎకరాలు, వరి పంట 59,212ఎకరాలు సాగవుతుందని అధికారులు అంచనాలు వేశారు. మొక్కజొన్న 742ఎకరాలు, జొన్న 680ఎకరాలు, పెసర 1700 ఎకరాలు, మినుములు 163ఎకరాలు, కంది 38,239 ఎకరాలు సాగవుతున్నట్లు అంచనాలు రూపొందించారు. అలాగే సోయాబీన్ 6089 ఎకరాలు, మిరప 3173ఎకరాలు, వేరుశెనగ 178ఎకరాలు, అముదాలు 10ఎకరాలు, నువ్వులు 10ఎకరాల్లో సాగు చేయనున్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు.

85.91 మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో సాధారణ సాగుకు మించి పంటలు సాగవుతాయని అంచనాలు రూపొందించిన అధికారులు 85.91 మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. యూరియా 45.06 మెట్రిక్ టన్నులు, డీఏపీ 11.26 మెట్రిక్ టన్నులు, ఎంఏపీ 4.05 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22.53మెట్రిక్ టన్నులు, అలాగే జిల్లాకు కావాల్సిన ఇతర ఎరువులు మూడు మెట్రిక్ టన్నులు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

ఏడు లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో పంట సాగుకు అంచనాలు వేసిన అధికారులు విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లాలో అరకొర సాగునీటి వసతితో రైతులు అధికంగా వర్షాధార పత్తి పంట వైపే ఆధారపడుతున్నారు. ఈ ఏడాది వానాకాలం సైతం అధికంగా పత్తిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధ మవుతున్నారు. జిల్లాలో సాగు విస్తీర్ణం 4,60,196ఎకరాల్లో ఉండగా ఇందులో మూడో వంతు పత్తిని సాగు చేయనున్నట్లు అధికారులు అంచనాలు వేశారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం, ఉన్న ప్రాజెక్టుల కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వర్షాధార పంటలనే రైతులు ఆశ్రయిస్తున్నారు. దీంతో జిల్లాలోమొత్తం విస్తీర్ణంలో అగ్రభాగం పత్తి సాగునే చేపడుతున్నారు. జిల్లాలో పత్తి పంట 3.5లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు రూపొం దించి నివేదికలు పంపించారు. ఇందుకుగాను వానాకాలం సీజన్‌లో ఆయా ప్రైవేటు కంపెనీలకు చెందిన విత్తన ప్యాకెట్లను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు. జిల్లాలో 7లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు.

వానాకాలం సాగుకు అంచనాలు రూపొందించాం..

రావూరి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి



వానాకాలం సాగుకు జిల్లాలో అంచనాలు రూపొందించాం. జిల్లాలో 4.60 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశాలు ఉన్నట్లు నివేదికలను రుపొందించాం. ఇందుకు ఇప్పటికే అన్ని మండల వ్యవసాయాధి కారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించాం. మండలాల వారీగా ప్రతిపాదనలు తెప్పించుకుని దానికి అనుగుణంగానే ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్

రెబ్బెన, ఏప్రిల్ 24: అంగన్వాడీ కేంద్రాలు పిల్లల ఎదుగుదలకు దోహదపడుతాయని జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆడెపు భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని నవేగాం, రాంపూర్ గ్రామాల్లో సాముహికంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సాదియారుక్సానా, సూపర్‌వైజర్ కళావతి, పోషన అభియాన్ కోఆర్డినేటర్ స్వప్న, పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

ఏనుగు దాడి బాధితులకు పరిహారం అందజేత



చెక్‌లను అందజేస్తున్న ఎఫ్‌డీవో అప్పలకొండ, ఎఫ్‌ఆర్‌వో రమాదేవి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24: కాగజ్‌నగర్ అటవీశాఖ డివిజన్ పరిధిలో ఈ నెల 3న ఏనుగుదాడిలో మృతిచెందిన అల్లూరి శంకర్, పోశన్న కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10లక్షల చెక్‌ను అటవీశాఖ అధికారులు అందజేశారు. ఈసంద ర్భంగా ఎఫ్‌డీవో అప్పలకొండ మాట్లాడుతూ వన్యప్రాణుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం పరిహారం అందజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రమాదేవి పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

కాగజ్‌నగర్, ఏప్రిల్ 24: కాగజ్‌నగర్ బురదగూడ వంతెన సమీపంలో బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి లారీ బోల్తాపడింది. ఎస్పీఎంకు లారీలో కెమికల్స్‌ను తీసుకవస్తుండగా, బురదగూడ వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి వంతెన కింద భాగంలో పడి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. కాగా ఆర్‌అండ్‌బీ వంతెన సైడ్‌వాల్స్ కూలిపోయాయి. ప్రభుత్వ ఆస్తినష్టం కావటంతో ఆర్‌అండ్ బి అధికారులు స్పందించి పోలీసులను ఆశ్రయించారు.



బోల్తాపడిన లారీ

ఊపందుకున్న కూలర్ల విక్రయాలు



సిర్పూర్(టి)లో విక్రయిస్తున్న కూలర్లు

సిర్పూర్(టి), ఏప్రిల్ 24: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వేడికి తట్టుకోలేక కూలర్ల కొనుగోళ్లపై దృష్టిసారిస్తున్నారు. వారంనుంచి కొనుగోళ్లు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. వచ్చేనెల మే కావడంతో మరింత గిరకీ పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు పెద్దసంఖ్యలో కూలర్లను తెచ్చి గోదాంలలో స్టాక్ ఉంచుతున్నారు.

పోలింగ్ కోసం సిద్ధంగా ఉండాలి

● రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికలలో భాగంగా మే13న జరుగనున్న పోలింగ్ కోసం అన్నిఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్నిజిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్‌లు, అదనపుకలెక్టర్‌లు, ఆర్‌డీవోలు, మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్‌రోజున పూర్తి స్థాయిలో ఓటింగ్ జరిగేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో పూర్తిస్థాయిలో మౌలిక సదు పాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ చేపట్టాలని, రాజకీయపార్టీలకు ముందస్తుగా సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వివిధ రాజకీయ పార్టీలు నియమించిన పోలింగ్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు ఓటరుస్లిప్‌లు పంపిణీ చేసే సమయంలో పాల్గొనవచ్చన్నారు. ఓటర్‌స్లిప్‌లు పంపిణీ పారదర్శకంగా జరగాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో ప్రత్యేకబృందాలను నియమించామన్నారు.

పోలింగ్ కొరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి సిద్ధంగా ఉన్నామన్నారు. పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్, అసెంబ్లీనియో జకవర్గాల్లో పోలింగ్‌కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ జారీ చర్యల్లో భాగంగా ఫారం 12 దరఖా స్తులను స్వీకరించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణు, డీఆర్ఓ లోకేశ్వర్‌రావు, తహసీల్దార్‌లు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో తగ్గిన ఉత్తీర్ణత

- జిల్లాకు నిరాశ
- రాష్ట్రంలో ఎనిమిదవ స్థానం
- ఫలితాల్లో బాలికలదే పైచేయి
- ఫస్టియర్ ఫలితాల్లో రాష్ట్రంలో 8వ స్థానం
- సెకండియర్ ఫలితాల్లో రాష్ట్రంలో 7వ స్థానం



ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ మీడియట్ ఫలితాలు జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది కాస్త నిరాశ పరిచాయి. ఫస్టియర్ జనరల్ విభాగంలో 2097 మంది బాలురు పరీక్షలకు హజరు కాగా ఇందులో 982 మంది ఉత్తీర్ణత సాధించగా 46.83శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే 2473మంది బాలికలు పరీక్షలు రాయగా 1831మంది ఉత్తీర్ణత సాధించగా 74.04శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం మొదటి సంవత్సరం పరీక్షలకు 4570 మంది పరీక్షలు రాయగా 2813 మంది ఉత్తీర్ణత సాధించడంతో 61.55 శాతం నమోదై రాష్ట్రంలో 8వస్థానాన్ని జిల్లా కైవసం చేసుకుంది. అలాగే సెకండియర్ జనరల్ విభాగంలో 1929మంది బాలురు పరీక్షలు రాయగా 1176 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో 60.96 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2166మంది బాలికలు పరీక్షలు రాయగా ఇందులో 1775మంది ఉత్తీర్ణత పొందగా 81.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 4095 మంది పరీక్షలు రాయగా ఇందులో 2951మంది ఉత్తీర్ణత పొందగా 72.06 ఉత్తీర్ణత శాతం నమోదైంది. దీంతో జిల్లా సెకండీయర్ ఫలితాల్లో రాష్ట్రంలో 7వ స్థానంలో నిలిచింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ఈ ఏడాది బాలికలే పైచేయి సాధించారు. అదే విధంగా ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరంలో మొత్తం 853 మంది పరీక్షలు రాయగా 480 మంది ఉత్తీర్ణత పొంది 56.27 ఉత్తీర్ణత శాతం సాధించారు. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 662 మంది పరీక్షలు రాయగా 526 మంది ఉత్తీర్ణత సాధించడంతో 79.46 ఉత్తీర్ణత శాతం నమోదైంది.

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు..

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సత్తచాటారు. గన్నారం మహాత్మా జ్యోతిబా పూలే కళాశాల విద్యార్థిని హేమదేవి 984మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. అలాగే జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థినులు పూజిత, అక్షయ 983 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ


రాచకొండ అక్షిత


బుజాడి ఉదయ్ కిరణ్

బెజ్జూరు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ ద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ప్రభుత్వ కళాశాలలో 131మంది పరీక్ష రాయగా 93మంది 71శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయసంవత్సరంలో 120 మంది విద్యార్థులకు గాను 105మంది విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణులయ్యారు. అలాగే కేజీబీవీలో సీఈసీ మొదటి సంవత్సరంలో 16మందికి 11మంది ఉత్తీర్ణత సాధించగా ఎంపీహెచ్‌డబ్ల్యూలో 36మందికి 23 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో సీఈసీలో 13మందికి 13మంది ఉతీర్ణత సాధించగా ఎంపీహెచ్‌డబ్ల్యూలో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో రాచకొండ అక్షిత 462/470 మార్కులు సాధించింది. అలాగే ద్వితీయ సంవత్సరంలో బుజాడి ఉదయ్ కిరణ్ 904/1000 మార్కులు సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు.

చింతలమానేపల్లి: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు 73 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో 40మందికి 33మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 54 మందికి గాను 36మంది సాధించారు. ద్వితీయ సంవత్సరంలో కె.అనూష (ఎంపీసీ) 879/1000, అర్చన (ఎంపీసీ) 871/1000 మార్కులు సాధించారు. శాలిని(బైపీసీ) 934/1000, స్వాతి(బైపీసీ) 909/1000 మార్కులు సాధించారు.

దహెగాం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం 85 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రథమసంవత్సరం విద్యార్థులు 80 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మహేందర్ బుధవారం తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థిని అంజలి (బైపిసీ) 924/1000 మార్కులు సాధించగా, దెబ్బటి హరి కృష్ణ (సీఈసీ) 862/1000, పాలె అంజలి(బైపీసీ) 368/480, రాణి (సీఈసీ) 378/480, కేజీబీవీలో 77శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ బాలికల, కాగజ్‌నగర్ గురుకుల కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీసీవో బాలరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.


సాయినాథ్


పూజ

జైనూర్: మండలంలో ఇంటర్మీడియట్ దితీయ సంవత్సరం పరీక్షలో 95శాతం ఫలితాలు సాధించామని ప్రభుత్వ జునీయర్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీదేవి బుధవారం తెలిపారు. మొదటి సంవత్సరంలో 89 శాతం ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. కాలేజీ టాపర్లుగా సాయినాథ్ 440కి గాను 430 మార్కులు, అనిత 470 మార్కులకు 448, ఆర్తి 470కి గాను 430, అస్మిత 470కి 417, పూజ1000 మార్కులకు 930, అభిలాష 1000 మార్కులకు 913మార్కులు సాధించారు.

కెరమెరి: మండలంలోని మోడి కేజీబీవీ కళాశాల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో మనుకుమార్ తెలిపారు. మొదటి సంవత్సరంలో రుక్మిణి 409/440, రేణుక 403/470 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో శ్రీలత 912/1000, సరిత 898/1000 మార్కులు సాదించినట్లు తెలిపారు. జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 112 మందికి 106మంది, మొదటి సంవత్సరంలో 104 మందికి 68మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.


రుక్మిణి


శ్రీలత

వాంకిడి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఫలితాల్లో మంచి ప్రతిభ కనబర్చారు. ద్వితీయ సంవత్సరం 162మందికి 159 మంది 98.14శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 160మందికి 130మంది 81.25శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయసంవత్సరంలో కె సాక్షిత్‌కుమార్ 964/1000, అర్జున్961/1000, సందేశ్ 909/1000, ఇందుమతి 862/1000, మొదటి సంవత్సరంలో సుచరిత 440/470, స్వప్న 438/470, సోనుప్రీత్ 415/440, వైష్ణవి414/440 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.


కె.సాక్షిత్‌కుమార్


అర్జున్

సిర్పూర్(యు): ఇంటర్మీడియట్ ఫలితాలు మోడల్ కాలేజి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్మీడియట్ ద్వితీయసంవత్సరంలో మండల కేంద్రానికి చెందిన కాంబ్లే ఆర్తి బైపిసి సెకండ్ ఇయర్‌లో 1000 మార్కులకు గాను 955మార్కులు సాధించి కాలేజి టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా మోడల్ కాలేజీలో 149మంది విద్యార్థులుండగా అందులో 139మంది 93శాతం ఉత్తీర్ణత సాధించారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 40శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తిరుపతి తెలిపారు. ఎం వినయ్ 935/1000, అర్చన 912/1000 ఎటి విభాగంలో టాపర్లుగా నిలిచినట్లు ప్రకటించారు. కెజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 71శాతం, మొదటి సంవత్సరంలో 62శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రమాదేవి ప్రకటించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ ఐశ్వర్యకు 963/1000, బీపీసీ అక్షితకు 881/1000 టాపర్లుగా రాణించినట్లు ప్రకటించారు.

ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వీడాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: ఉపాధిహామీపనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధిహామీ పనుల్లో కూలీలసంఖ్య తగ్గడంపై వివరణ కోరారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నవారిపై వెంటనేచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధిహామీ సిబ్బందికి పనులపై స్పష్టమైన అవగాహన ఉండాలన్నారు. గ్రామఅవసరాల మేరకు పనులపై తీర్మానం చేయాలన్నారు. అర్హులైన కూలీలందరికీ పనికల్పించాలని సూచించారు. కూలీలహాజరు మొబై ల్‌యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో వెళ్తేనే ఫలితాలు బాగుంటాయన్నారు. వేసవిదృష్ట్యా పనిప్రదేశాల్లో తాగునీరు, నీడతోపాటు అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవోలు, కార్యదర్శులు, ఈజీఎస్ ఎఫ్‌ఏలు, టీఏలు పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, పిల్లలు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులలో ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసలు అయినట్లయితే వారివివరాలను తమకు తెలియజేయాలన్నారు. వారిని డీ అడిక్షన్ సెంటర్‌ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మత్తుపదా ర్థాలను మానిపించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు పెంచినా, స్వీకరించినా, రవాణా చేసినా వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాదకద్రవ్యాలను అరికట్టడంలో ప్రతిఒక్కరూ భాగ స్వాములు కావాలన్నారు. గంజాయిరహిత జిల్లా కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

ఆర్డీవో కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 24: ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. జాతీయరహదారి నిర్మాణంలో భాగంగా సేకరించిన భూముల నష్టపరిహారం చెల్లింపుల్లో పెద్దఎత్తున అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఫిర్యాదుల మేరకు ఈ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయంలో భూ నిర్వాసితులకు సంబంధించిన రికార్డులను స్వాధీన పరుచు కున్నారు. గతంలో ఆర్డీవోగా ఇక్కడ పనిచేసిన సిడాం దత్తు, డీటీ నాగోరావు, ఎంసీ భరత్‌పై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు రావడంతో వారు పనిచేసిన సమయంలో జరిగిన లావాదేవిలపై ప్రాథమిక విచారణను చేపట్టినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ అధికారులో గుబులు మొదలైంది.

అంగరంగ వైభవంగా మహంకాళి జాతర


అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

రెబ్బెన, ఏప్రిల్ 24: రెబ్బెన మండలం ఇందిరానగర్ మహంకాళి అమ్మవారి జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా భక్తు లు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నైవేద్యాలను సమర్పించారు.

రుద్రాపూర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


రుద్రాపూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 24: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో సీఐ సాదిక్‌పాషా ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీపీవో భిక్షపతి

సిర్పూర్(టి), ఏప్రిల్ 24: గ్రామపంచాయతీ కార్యదర్శులు వేసవి దృష్ట్యా నీటిసరఫరాపై దృష్టి సారించాలని డీపీవో భిక్షపతి అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నీటిఎద్దడి, పారిశుధ్యంపై దృష్టిసారించాలని, ఈజీఎస్ కూలీల సంఖ్యపెంచాలని, ఇంటిపన్ను వందశాతం వసూలు చేయాలన్నారు. గ్రామపంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలో అన్నివసతులు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. ఆయనవెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీవో చంద్రయ్య, ఎంపీవో కృష్ణమూర్తి, కార్యదర్శులు ఉన్నారు.

పాఠశాలల పనులను సకాలంలో పూర్తిచేయాలి: కలెక్టర్


సిర్పూర్(టి)లో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

సిర్పూర్(టి), ఏప్రిల్ 24: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం మండలంలోని జక్కాపూర్, మాకిడి పాఠశాలల్లో చేపడుతున్న పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై డీఈ రాజ్‌కుమార్‌ను అడిగితెలుసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మే13న జరగనున్న నేపథ్యంలో ఆలోపు పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కేంద్రాల్లో అన్నిరకాలవసతులు ఉండేలా చూసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు సూచించారు. వృద్ధులకు, వికలాంగుల కోసం సౌకర్యాలు ఏర్పాటు చేయా లన్నారు. అలాగే సరిహద్దులో మహారాష్ట్ర రోడ్డుపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీచేశారు. అక్రమ మద్యం, నగదు తరలింపు దృష్టి పెట్టాల న్నారు. ఆయనవెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

కాగజ్‌నగర్: అమ్మ ఆదర్శ పాఠశాలలను బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో ఎంపికైన పాఠశాలల్లో సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కమిషనర్ అంజయ్య, సిబ్బందిఉన్నారు.

సభాస్థలి పరిశీలన

బెజ్జూరు, ఏప్రిల్ 24: ఈనెల27న మండలకేంద్రంలో నిర్వహించనున్న కాంగ్రెస్‌బహిరంగసభ స్థలిని బుధవారం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ నాయకుడు రావి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు మంత్రి సీతక్క, మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎంపీ అభ్యర్థి సుగుణక్క రానున్నట్లు తెలిపారు. ఆయన వెంటనాయకులు బషరత్‌ఖాన్, వెంకన్న, జావీద్, నరేందర్, అమీరుద్దీన్, దుర్గయ్య, సౌకత్‌అలీఖాన్, శ్రీనివాస్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సుగుణను గెలిపించాలి

జైనూర్, ఏప్రిల్ 24: కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీమెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం మండలంలోని కొద్దుగూడ, రాసిమెట్ట, భుసిమెట్ట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ మాట్లాడుతూ బీజేపీఅధికారంలోకివస్తే బడుగు బలహీనవర్గాల భవిష్యత్తు, మనుగడకష్టంగా మారుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పాలన ఉన్నందున కేంద్రంలోనూ ఈసారి కాంగ్రెస్‌పాలన రావడం ఖాయమన్నారు. ఈసందర్భంగా మాజీవైస్‌ఎంపీపీ షేక్‌రషీద్, హైమద్‌ఖాన్, సుద్దాల ఆనంద్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యుబ్ ఖాన్, ఆస్లం, పెందుర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 24: అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం జిల్లా ప్రధానన్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు చెప్పారు. ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని తుంపల్లి గ్రామానికి చెందిన పొలవేణి సాయి అలియస్ సాయికుమార్ మాయమాటలు చెప్పి మభ్యపెట్టి ఫిబ్రవరి2, 2019న కిడ్నాప్‌చేసి శారీరకంగా లోబరుచుకు న్నాడు. అంతకుముందు కూడా యువతిని వివాహం చేసు కుంటానని చెప్పి అనేకసార్లు లోబరుచుకున్నాడు. ఈ మేరకు యువతి తండ్రి దామోదర్ ఫిబ్రవరి 3, 2019న ఆసిఫాబాద్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశారు. పీపీ జీవీఎస్ ప్రసాద్ సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 సంవ త్సరాల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు చెప్పినట్లు డీఎస్పీ తెలిపారు.

బావిలో పడి యువకుడు మృతి

లింగాపూర్, ఏప్రిల్ 24: మండలంలోని వంజారీగూడకు చెందిన ముండె బాలాజీ(28) అనే యువకుడు గ్రామ పరిసరాల్లోని వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు లింగపూర్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు అందించిన సమాచారం ప్రకారం.. ముండె బాలాజీ కొద్దిరోజుల నుంచి మతిస్థిమితం కోల్పో యాడు. తరచూ ఇతర ప్రాంతాలకు వెళ్తుండేవాడు. పలు మార్లు వెంటపడి ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో బాలాజీ ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిపోగా అతని కోసం వివిధ గ్రామాల్లో వెతికారు. చివరకు గ్రామంలోని వ్యవ సాయ బావిలో శవమై కనిపించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

బెజ్జూరు, ఏప్రిల్ 24: మండలంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేసి నలుగురిని గాయపర్చాయి. మండల కేంద్రా నికి చెందిన రిషిత, జునేరా, వషాక సుశాంత్, ఇందుర్‌గాం గ్రామానికి చెందిన కావిడే సాయితేజపై దాడిచేసి కరి చాయి. వీరంతా ఇళ్లముందు ఆడుకుంటుండగా ఒక్క సారిగా పిచ్చికుక్క దాడిచేయడంతో తీవ్రంగా గాయ పడ్డారు. వెంటనే బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



ఓసీని పరిశీలించిన సీఎండీ బలరాం


ఓసీని పరిశీలిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్‌బలరాం

రెబ్బెన, ఏప్రిల్ 24: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయ అధికారులతో మాట్లాడారు. గతేడాది సాధించిన ఉత్పత్తి, ఉత్పాక వివరాలను జీఎం రవిప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఖైరిగూడ ప్రాజెక్టు అధికారి ఎన్ సత్యనారాయణ, పీవో ఉమాకాంత్, ఏజీఎం తిరుమల్‌రావు, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్మికవర్గ ప్రయోజనాల కోసం పోరాటాలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 24: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి పోరాటాలకైనా తమ యూనియన్ సిద్ధంగా ఉందని గుర్తింపుసంఘం బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్ తెలిపారు. బుధవారం ఏరియా వర్క్‌షాపులో కార్మికులను కలిసి మాట్లాడారు. నవంబర్‌లో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమపై నమ్మకం ఉంచి గుర్తింపు సంఘంగా ఎన్నుకున్నారని, కానీ ఇంతవరకు కార్మిక గుర్తింపు పత్రం యాజమాన్యం ఇవ్వలేదన్నారు. దీనిపై పోరాటాలు చేస్తామన్నారు. మే 1న ప్రపంచకార్మిక దినోత్సవం సందర్భంగా సింగరేణివ్యాప్తంగా మేడేను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మేడే పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కంది శ్రీనివాస్, బానయ్య, దినేష్, రాజేశం, భూమయ్య, రాజమౌళి, పోశాలు, శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, రాజయ్యసారయ్యనరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ

కాసిపేట, ఏప్రిల్ 24: కాసిపేట 2వగనిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు గని మేనేజర్ లక్ష్మీ నారాయణకు బుధవారం వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ కేంద్రకార్యదర్శి అక్బర్‌ఆలీ, బెల్లంపల్లి బ్రాంచ్‌కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కాసిపేటగనుల్లో కాలం చెల్లిన పాత ఎస్‌డీఎల్ యంత్రాలను వెంటనే తొలగించి కొత్త యంత్రాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎస్‌డీఎల్ ఆపరేటర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, టెక్నీషియన్ కార్మికులకు హెల్పర్లను అందజేయాలని కోరారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం గనిమేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల శ్రీనివాస్, వెంకటేష్, శ్రీనివాస్, నర్సయ్య, వెంకటేష్, సుభాష్‌చంద్రబోస్, మొయినోద్దీన్, కేతన్, జావేద్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పరికరాలను ఏర్పాటు చేయాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 24: బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు అవసరమైన పరికరాలు తయారుచేసే నూతన మిషనరీలను ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు ప్లేడేలు అమలు చేయాలని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం ఏరియా వర్క్‌షాపులో అధికారులను కలిసి సమస్యలపై వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఆయాగనులు, డిపార్టుమెంట్లలో పాడైన పరికరాలను వర్క్‌షాపులోని మిషన్‌లలో తయారు చేస్తామని, పాతమిషన్‌లు కావడంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాతమిషన్‌ల స్థానంలో కొత్తమిషన్‌లు తెస్తే పని సులువుగా ఉంటుందన్నారు. అన్నిసెక్షన్‌లలో పనిచేస్తున్న కార్మికులకు నాణ్యమైనటూల్స్‌ను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భారత్, సంతోష్, అన్వేష్, మధు, సదానందం, శ్రీనివాస్, ప్రమోద్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 24: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కేకే5గని మేనేజర్ అల్లావుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం కేకే5గనిపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకోసం అందరు దృష్టిని సారించాలన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. ఇంధనాన్ని పొదుపుగా వినియోగించాలన్నారు. సైకిళ్లను వాడడం ద్వారా పర్యావరణం పచ్చగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌మేనేజర్ జశ్వంత్, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.